నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
బుధవారం | 05 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

మెడికల్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-మెదక్



మెదక్, పిల్లికోటాల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య విద్యార్థులతో వారి విద్య భోదన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల క్యాంటీన్ నిర్వహణ, ల్యాబ్ నిర్వహణ, హాస్టల్ వసతుల గురించి ప్రిన్సిపాల్ డా.రవీంద్ర కుమార్ కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అన్ని ఆధునిక సౌకర్యాలతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైస్ ప్రిన్సిపాల్ డా.జయ, సూపరింటెండెంట్ శివదయాళ్ విద్యార్థిని, విద్యార్థులు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలి

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్





ప్రతీ విద్యార్థి బాగా చదువుకొని జీవితంలో ఉన్నతమైన స్థానం లో స్థిరపడాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముమేకమై మెనూ పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున సబ్జెక్టుల వారీగా బోధన సామర్థ్యాలను మెరుగు పరచుకొని ఉత్తీర్ణత సాధించాలని, చదువులు చెప్పిన గురువులకు, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల వసతి గృహ వార్డెన్, సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మునిపల్లి

మండల కేంద్రమైన సబ్‌స్టేషన్‌లో 33/11కేవీ మరమ్మత్తుల కారణంగా నేటి(బుధవారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సంతోష్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు, అలాగే విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించడం వంటి పనులు జరుగుతున్నాయి కాబట్టి మునిపల్లి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి మునిపల్లి, బుదేరా, పోల్కంపల్లి, గోపులారం, ఇబ్రహీంపూర్, మల్లారెడ్డి పేట్, బూసారెడ్డిపల్లి, ఖమ్మం పల్లి, చిన్న చెల్మెడ, అల్లాపూర్, తక్కడపల్లి, హైదలాపూర్ గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

ఓటర్ లిస్ట్ పై అభ్యంతరాల స్వీకరణ ఎంపీడీవో

నవతెలంగాణ-చౌటకూర్



గ్రామాల్లోని ఓటర్ లిస్ట్ అదేవిదంగా కొత్త ఓటర్ల లిస్టులపై రాజకీయ పార్టీలకు, ప్రతినిధులకు అవగాహన, అభ్యంతరాల స్వీకరణ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో రామ లింగం తెలిపారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎంపీవో శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియ జేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్, సార గోవర్ధన్, ఆగమయ్య, సుధాకర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కమిషనర్‌ను కలిసిన వీరేశం గౌడ్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



గడ్డపోతారం మున్సిపల్ నూతన కమిషనర్ జేత్రం నాయక్‌ను మాజీ వార్డు సభ్యుడు వీరేశం గౌడ్, ప్రదీప్ రాజు, నాగరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాల్టీ పరిధిలోని పలు సమస్యలను కమీషనర్ జేత్రం నాయక్ దృష్టికి తెచ్చారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

ఓటర్ లిస్టుల జాబితా అందజేత


నవతెలంగాణ-వట్‌పల్లి




ఓటర్ లిస్టుల జాబితాలో తమ తమ గ్రామాలకు సంబంధించిన పేర్ల నమోదును సరి చూసుకోవాలని.. ఏమైనా తప్పులుంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఎంపీడీవో శశి ప్రభ తెలిపారు. వివిధ గ్రామాలకు సంబంధించిన అన్ని పార్టీల గ్రామాల అధ్యక్షులతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓటర్ లిస్ట్ జాబితాలోని పేర్లను ఆయా గ్రామాలకు సంబంధించిందా.. కాదా అని గుర్తుపట్టాలన్నారు. కొంతమంది ఓటర్ల పేర్లు ఇతర గ్రామాల్లో.. ఇతర గ్రామాలకు చెందిన వారి పేర్లు మీ గ్రామాల ఓటర్ లిస్ట్ జాబితాలో నమోదైనట్టు తెలుస్తున్నదన్నారు. కాబట్టి ఆ తప్పులను గుర్తుపట్టి తమ దృష్టికి తీసుకురా వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాజా నజరుద్దీన్, సూపరింటెండెంట్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ దశరథ్, ఆల్ పార్టీస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శివాజీ రావు, గోపాల్ రెడ్డి, కచ్చూర్‌రావు, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షునిగా కృష్ణ

నవతెలంగాణ-జహీరాబాద్





జహీరాబాద్ గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్టు సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి ఎస్.మహిపాల్ తెలిపారు. అధ్య క్షులుగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఖలీల్, జయరాజు ప్రధాన కార్యదర్శిగా యేసు, కార్యదర్శులుగా మోగులమ్మ, లలితమ్మ, కోశాధికారిగా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా జయరాజ్, తిరుమలేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ కార్యవర్గం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని.. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మహిపాల్ సూచించారు.


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కోహీర్

మండలంలోని పిచేర్యాగడి పాతతాండలో రామావత్ రాజు(28) కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత కె.ప్రసాద్‌రెడ్డి మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.10 వేలను కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్ ద్వారా పంపించారు. ఈ సాయాన్ని తాండా పెద్దల చేతుల మీదుగా తాండ కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండావాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-కొండాపూర్



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సంగారెడ్డి జిల్లా గిరిజన లంబాడి సంక్షేమ సంఘం అధ్యక్షులు బాణావత్ రోహిత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈనెల 15వ తేదీన సేవాలాల్ మహారాజ్ జయ ంతి ఉన్నందున దేశవ్యాప్తంగా అన్ని గిరిజన తండాల్లో సేవాలాల్ మహారాజ్ జయ ంతి వేడుకలను బంజారా జాతి బిడ్డలు ఘనంగా నిర్వహిస్తారని ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఓ నిర్ణయం తీసుకొని సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వివిధ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ సమావేశం



నవతెలంగాణ- రాయపోల్

తెలంగాణ రాష్ట ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బాలయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాలలో వార్డుల ప్రకారం ముసాయిదా ఓటర్ జాబితాను గ్రామపంచాయతీ నోటీసు బోర్డులలో గతంలోనే ప్రదర్శించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు, గ్రామ ప్రజలు వారి వారి ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా పంచాయతీ కార్యదర్శులకు కానీ గ్రామ బిఎల్వోలకు కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్ తుది జాబితా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు, మండల ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు తీర్పు.. ఒంటరి వ్యక్తులకు ఊరట



నవతెలంగాణ-గజ్వేల్

హైకోర్టు తీర్పు వితంతువు, ఒంటరి పురుషులు, మహిళలకు హైకోర్టు తీర్పు ఓదార్పుగా ఉందని ఒంటరి నిర్వాసితులు అంటున్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఆస్తులు, భూములు కోల్పోయి సాయం కోసం ఎదురుచూస్తున్న వారికి హైకోర్టు తీర్పు ఊరట ఇచ్చిందని చెప్పాలి. ఇటీవల నవతెలంగాణ దినపత్రికలో నిర్వాసితుల ప్యాకేజీలు ఊసే లేదు. ప్రాజెక్టు నిర్వాసితుల ఎదురుచూపులు, ప్రభుత్వ ప్రకటన కోసం నిత్యం నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగానే ముంపు గ్రామాల వితంతువులకు ఈ ప్రకటన ఊరట లభించింది. వితంతువులు, ఒంటరి మహిళ, ఒంటరి పురుషులకు ఒక కుటుంబంగా గుర్తించి పరిహారం ఇవ్వాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొగుట మండలం పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, తండా, బంజేరుపల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి తదితర గ్రామాల ప్రజలు ప్రాజెక్టుతో నిరాశ్రయులయ్యారు. నిర్వాసితులకు గజ్వేల్ పట్టణంలో సంగాపూర్ సమీపంలో 600 ఎకరాల్లో గ్రామాలను పునర్నిర్మాణం చేశారు. కొందరికి రెండు పడకల గదులు కేటాయించగా, మరికొందరు స్థలాలు తీసుకుని ఇండ్లు నిర్మించుకుంటున్నారు. నిర్వాసిత కుటుంబాలు, 18 ఏళ్ల దాటిన వారు, 65 ఏళ్ల దాటిన వారికి రూ.7.50 లక్షల ప్యాకేజీని ఇచ్చారు. అయితే వితంతువులను కుటుంబాల్లోని సభ్యురాలుగా గుర్తించడంతో ప్రభుత్వ పరిహారం ఇవ్వలేకపోయింది. ఒంటరి పురుషునికి, ఒంటరి మహిళ, వితంతువులకు కుటుంబంగా గుర్తించాలని కోర్టు తీర్పించింది. దీంతో స్థానిక నాయకుల సహాయంతో హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఇటీవల ఈ కేసు విచారణకు రావడంతో వాదోపవాదాల అనంతరం వారికి ప్యాకేజీ వర్తింప చేయాలని తీర్పు ఇచ్చింది. అన్ని గ్రామాల్లో మొత్తం 500 పైగా ఉండగా, పలువురు మృతిచెందారు. మల్లన్న సాగర్ కాలనీలో ప్రస్తుతం 450 మందికి పైగా ఉంటారని అధికారులు చెప్పుకొస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో వేచి చూడాలి.


ఒంటరి మహిలలను పట్టించుకోనందుకే కోర్టుకెళ్ళాము



అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. ఒంటరి మహిళలను పట్టించుకోలేదు. అందుకే కోర్టుకు వెళ్లాం. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే ప్లాటు, మంజూరు చేయాలి. సర్వం కోల్పోయి ఇక్కడికి వచ్చాం.

నాగులపల్లి నరసవ్వ, ఏటిగడ్డ కిష్టాపూర్.

కోర్టు తీర్పు సంతోషం



కోర్టు తీర్పు సంతోషం. చాలా రోజులుగా ప్రయత్నాలు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఒంటరి పురుషులకు ప్యాకేజీ, ప్లాట్లు ఇవ్వాలని తిరిగినాం. ప్రభుత్వం స్పందించక పోవడంతో కోర్టును ఆశ్రయించాం. ఇప్పుడు కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం వెంటనే ప్లాటు, ప్యాకేజీ ఇవ్వాలి లేకపోతే మళ్లీ కోర్టు వెళ్తాం.

జయాల నరసయ్య, ఏటిగడ్డ కిష్టాపూర్

ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ కోర్టుకెళ్తాం



మల్లన్న సాగర్ పరిధిలోని ఒంటరి మహిళలను, ఒంటరి పురుషులను పట్టించుకోకపోవడంతో కోర్టుకు వెళ్లాం. కోర్టు స్పందించి వారిని కుటుంబ సభ్యులుగా గుర్తించి పరిహారం, ప్లాటు ఇవ్వాలని సూచించింది. ప్రభుత్వం జాప్యం చేస్తే మళ్లీ కోర్టుకు వెళ్తాం. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి రావాలి.

సీఐటీయూ జిల్లా నాయకులు బండ్ల స్వామి

ఖమ్మంపల్లి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి





నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని ఖమ్మంపల్లిలో ఉపాధి హామీ కింద పాఠశాల ప్రహరీ నిర్మించగా.. బిల్లులు చెల్లించడంలో పంచాయతీ కార్యదర్శి వేధింపులకు పాల్పడుతున్నాడని, అందుకు ఎంపీడీఓ కూడా సహకరిస్తున్నాడని ఆరోపి స్తూ.. గ్రామానికి చెందిన తుడుం సుభాష్ సంగారెడ్డి జిల్లా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్క వెంకటయ్యకు, తెలంగాణ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ ఉపాధి శాఖ అధికారి ఫిర్యాదులో చేశారు. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాల చుట్టూ గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు అప్పట్లో తాను ప్రహరీ నిర్మాణం చేపట్టానన్నారు. అందుకు సంబంధించి పంచాయతీలో రూ.3,88,000 సంబంధిత ఖాతాలో జమ అయినప్పటికీ గ్రామ పంచాయతీ కార్యదర్శి బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తన దగ్గర పని పూర్తయినట్టు విద్యాకమిటీ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ తీర్మానం కావాలని వేధిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో గ్రామ పంచాయతీ తీర్మానం కాపీని సంబంధిత పీఆర్ఏఈ మధుకర్‌కు అందించానని ప్రస్తుతం తీర్మానం కాపీ లేదనే సాకుతో గ్రామపంచాయతీ కార్యదర్శి తనకు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. గతంలో తుడుం శాంతమ్మ ఇన్చార్జిగా ఉన్న సమయంలో తాను చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేందుకు గాను కార్యదర్శి తన దగ్గర ఒకసారి రూ.20,000, రెండో సారి రూ.5000 తీసుకున్నారని ఆరోపించారు. తాను ఎస్సీ కులానికి చెందడంతో తనను చిన్నచూపు చూస్తున్నారన్నారు.కాబట్టి పంచాయతీ కార్యదర్శిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సుభాష్ కోరారు.

జీపీ కార్మికులకు రూ.26 వేల వేతనమివ్వాలి



నవతెలంగాణ-జహీరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను రూ.26వేలకు పెంచాలని.. అలాగే వారి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు ప్రతినెలా వేతనాలు రాకపో వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని.. తద్వారా వారి కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ అసెంబ్లీ సమావేశాల్లో కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని యెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యేసు, కృష్ణ, జయరాజు, శ్రీనివాస్, తదితరులున్నారు.

అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన బీఆర్ఎస్ శ్రేణుల అరెస్ట్

నవతెలంగాణ-జహీరాబాద్



తమ పదవి కాలంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర సర్పంచుల జెఏసి ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, తాజా మాజీ సర్పంచులు చిన్న రెడ్డి (శేఖపూర్) విజయ్ (రాయిపల్లి డి)లను పట్టణంలోని అతిథి హోటల్ వద్ద జహీరాబాద్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ ముట్టడికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఉదయమే హైదరాబాద్‌కు తరలి వెళ్ళడానికి సిద్ధం కాగా.. పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉద్యమానికి సిద్ధమైనట్టు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీలో నిధులు అందుబాటులో లేకపోయినప్పటికీ సర్పంచులు అప్పు చేసి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఆ బిల్లులు చెల్లించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలు



నవతెలంగాణ-రాయపోల్ : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వాహనదారులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్‌కు చెందిన పిట్ల సాయికిరణ్, మెదక్ జిల్లా శంకరంపేట మండలం చెన్నయి పల్లి గ్రామానికి చెందిన చింత రాజు ఇద్దరు ద్విచక్ర వాహనదారులు అంకిరెడ్డి పల్లి గ్రామ శివారులో ఎదురెదురుగా అజాగ్రత్తగా, అతివేగంతో వస్తూ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పిట్ల సాయికిరణ్, చింత రాజు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులు ఇద్దరిని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పదాల రాములు

నవతెలంగాణ-దౌల్తాబాద్



నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పదాల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య అన్నారు. దౌల్తాబాద్ మండలం పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహ్మద్ నగర్ గ్రామానికి చెందిన షేక్ సఫియా రూ.30 వేలు, తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వెంకన్నగారి రాములమ్మ రూ.60 వేలు, అప్పాయిపల్లి గ్రామానికి చెందిన కాశబోయిన శేఖర్ రూ. 32,500 వేల సీఎం సహాయనిధి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం ప్రగతి బాటలో నడిచినట్లని పేర్కొన్నారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బందారు లాలు, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో 100శాతం ప్రయివేటు పెట్టుబడులను నిషేదించాలి

నవతెలంగాణ-జహీరాబాద్



ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీలో 100శాతం ప్రయివేటు రంగం వారికి పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించడం చట్టవిరుద్ధమని ఆల్ ఇండియా ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాటి నుంచి ఎల్ఐసి సంస్థపై కక్షగట్టి బంగారు గుడ్డు లాంటి సంస్థను ప్రైవేటు వారిచేతిలో పెట్టేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు, ఎల్ఐసి లబ్ధిదారులు ఎన్నో ఆందోళన చేపట్టినప్పటికీ వాట న్నిటిని పరిగణిలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరించడం మంచి పరిణామం కాదని హెచ్చరించారు. బీమా చట్ట సవరణ 2024 ను రద్దు చేయాలి, ఎల్ఐసి ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీ ని రద్దు చేయాలి, సంస్థలో క్లాస్-3, క్లాస్ ఫోర్ ఖాళీలను భర్తీ చేయా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, మాన య్య, అశోక్, రాజశేఖర్ విష్ణు అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్‌లో టిఫిన్ రేట్లు తగ్గించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ హాస్పిటల్‌లో టిఫిన్ రేట్లు తగ్గించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్‌కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఈ మధ్య కాలంలో ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభించిం దన్నారు. అయితే క్యాంటీన్ యజమాన్యం అధిక ధరలకు విక్రయిస్తుం డడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ అంటేనే పేదలు, కార్మికులు వస్తుంటారని.. అలాంటిది ధరలు ఎకువగా ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. హాస్పిటల్‌లో క్యాంటీన్ నడుపుతున్న యాజమా న్యానికి రూమ్ రెంటు లేదు, కరెంట్ బిల్లు లేదు కానీ పేద ప్రజల నుంచి టిఫిన్‌కి రూ.40, చాయ్‌కు రూ.15 తీసుకోవడం సరికాదన్నారు. కాబట్టి క్యాంటీన్ యజమా న్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్ యక్షులు రాజు, కార్యదర్శి, ఇమ్రాన్ యూనియన్ నాయకులు వేణు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్టీయూ టీఎస్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, కార్మిక నాయకుడు, కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలను ఎస్టీయూ టీఎస్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్‌లు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, మహా కవి, ప్రముఖ కార్మిక నాయకుడు, ఉర్దూ కవి, హైదరాబాదు సంస్థా నంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకడైన మగ్దూం మొహియ ఉద్దీన్‌న్నారు. ఆయన పూర్తి పేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి అని.. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా అన్ని వర్గాలకు సమన్యాయం కోసం నిలిచి ఉద్యమం చేశాడన్నారు. అందులో భాగంగా ఉపాధ్యాయ వర్గాన్ని చైతన్యపరుస్తూ.. కొంతమంది ఉపాధ్యా యులను కూడగట్టి స్టేట్ టీచర్స్ యూనియన్ హైదరాబాద్ పేరుతో ఉపాధ్యాయ సంఘం స్థాపించి ఉపాధ్యాయ హక్కులకై పోరాటం చేశాడని కొనియాడారు. ప్రజల మద్దతుతో ఎమ్మెల్సీగా గెలుపొంది విలువైన సేవలు అందించినారన్నారు. విద్యారంగం బలోపేతానికి పర్యవేక్షణ పోస్టులైన డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్స్‌లను రెగ్యులర్ ప్రతిపాదికన పదోన్నతులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రవణ కుమార్, సంగారెడ్డి మండల అధ్యక్షులు అంజద్ అలీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, నిజాంపేట మండల అధ్యక్షులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు అలవాటు పడి యువకుల చైన్ స్నాచింగ్

- పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్





జల్సాలకు, బెట్టింగ్ లకు అలవాటు పడి ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్ పాల్పడుతూ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు మంగళవారం మెదక్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పాల్గొని వివరాలను వెల్లడించారు. జల్సాలకు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇద్దరు వ్యక్తులు డబ్బుల కోసం ద్విచక్ర వాహనాలు ఆపి చిరునామా అడుగుతున్నట్లు నటిస్తూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మెదక్ పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్, మహమ్మద్ అబ్దుల్ షఫీ ఇద్దరు వారి స్నేహితుడైన మహమ్మద్ హాఫీజ్ వద్ద నుంచి బైక్ తీసుకొని, చైన్ స్నాచింగ్స్ పాల్పడుతున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఔరంగాబాద్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా యూనికాన్ బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకొని పారిపోయారన్నారు.పోలీసులు వారిని వెంబడించి హవేలి ఘనపూర్‌లో విచారణ చేయగా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని ముత్తాయి కోట, జక్కన్నపేట్, బూరుగుపల్లి శివారులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారం, రెండు హెల్మెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేసినట్లు తెలిపారు.అలాగే కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపూర్, రాజంపేట్, బిక్నూర్ మండలం జంగంపల్లి శివారులో ఆరు తులాల బంగారాన్ని చైన్ స్నాచింగ్ చేసినట్టు తెలిపారు. కామరెడ్డిలో చైన్ స్నాచింగ్ లో దోచుకున్న బంగారాన్ని హైదరాబాదులోని వాల్యూ గోల్డ్ లో అమ్మగా వచ్చిన రూ.2,08,293 నగదును పంచుకున్నారని తెలిపారు. వాల్యూ గోల్డ్ వారికి కూడా నోటీస్ ఇచ్చామని దానిని కూడా రికవరీ చేస్తామని తెలిపారు. గ్రామ, పట్టణాలలో పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. చైన్ స్నాచింగ్ కేసులో నిందితులను అరెస్టు చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్ రెడ్డి, హవేలీ ఘనపూర్ ఎస్సై సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది రమేష్, కుమార్, జయనంద్, గౌస్ వరప్రసాద్ లు పాల్గొన్నారు.

మగ్దూంపల్లి పాఠశాలలో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-మునిపల్లి

ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని మునిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరినందన్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మగ్దూంపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. రెండో తరగతి విద్యార్థులతో ఆంగ్లం చదివించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సమ సమాజ నిర్మాణం, సమాజం యొక్క భవిష్యత్తు మొత్తం ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని.. కాబట్టి వారు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య, ఉపాధ్యాయులు యాదగిరి పంచాయతీ కార్యదర్శి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మనూర్

రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. నాగలిగిద్దా మండలంలోని సక్యనాయక్ తండాలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధర తో కొనుగోలు చేస్తున్నదన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దు అని సూచించారు. ఎఈఓ దగ్గర రాసుకొని రైతు పట్టా పాస్‌బుక్, బ్యాంకు అకౌంట్, ఆధార్ జిరాక్స్ పత్రాలు తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలం ఏఓ ప్రవీణ్ చారి, ఏఈఓ సంతోష్ కుమార్, నిర్వాహకులు రాజు రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన

నవతెలంగాణ-న్యాల్‌కల్

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'భేటీ బచావో.. భేటీ పడావో' కార్యక్రమంపై విద్యార్థులకు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. న్యాల్‌కల్‌లో కేజీబీవీ పాఠశాలలో పీసీ పీఎన్ డీటీ పై లింగ నిర్ధారణ, ఆడపిల్ల ప్రాముఖ్యత ఆరోగ్యం, రక్తహీనత నివారణ, కిషోర బాలికలు పరిశుభ్రతపై ఐసీడీసీ సీడీపీఓ అంజమ్మ విద్యార్థులకు వివరించారు. ఆడపిల్లలు విద్యతో రాణించి ముందుకెళ్లాలని అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. అనంతరం వారందరితో ప్రతిజ్ఞ చేయించి.. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అమృత్ రాజ్, జిల్లా సాధికారత సమన్వయకర్త పల్లవి, సూపర్వైజర్ అనిత, అంగన్వాడీ ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌటకూర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో హెూలిస్టిక్ హాస్పిటల్ కూకట్‌పల్లి వారి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు మంగళవారం ఉచిత మెడికల్ మెగా క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్‌లు, స్టాఫ్ నర్సులు పాల్గొని గ్రామస్థులకు ఉచిత గుండె పరిక్షలు, కంటీ పరీక్షలు, మోకాళ్ళ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్‌లు అవసరం ఉన్నవారికీ తమ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్స్ చేస్తామని డాక్టర్స్ తెలిపారు. ఈ క్యాంపులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగులో చైతన్యపరిచేందుకు రైతునేస్తం

నవతెలంగాణ-న్యాల్‌కల్

వ్యవసాయ సాగులో రైతులను చైతన్య పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం ప్రతీ మంగళవారం రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తు న్నది. అందులో భాగంగా ముంగి రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయ పద్ధతులు, అడవి పందులు, కోతుల బెడద నుంచి పంటను కాపాడుకునే పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల వ్యవసాయ అధికారులకు తెలిపారు. చెరకు, ఇతరత్రా పంటల్లో వచ్చే సాగు చీడపురుగుల పట్ల మెలుకువలు ఎలా పాటించాలో తెలిపారు. ప్రతీ మంగళవారం ముంగి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం కొనసాగుతుందని.. సాగు పద్ధతుల సందేహాలు, సూచనలు, నివృత్తి కోసం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి ఏవో అవినాష్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయిలు, నాగేష్, సాయి కిరణ్ రెడ్డి, రైతులు ఉన్నారు.



వార్డుల వారీగా ఓటర్ల విభజన

నవతెలంగాణ-జహీరాబాద్

గతేడాది డిసెంబర్ 31వ తేదీ వరకు వచ్చిన నూతన ఓటర్లను ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా విభజించినట్టు ఎంపీడీవో వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీల నాయకుల సమావేశంలో ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు.



వ్యవసాయ పొలాల్లో వేలాడుతున్న వైర్లు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోనే విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాడుతున్న వైర్ల వల్ల ప్రాణాలు అరచేతులో పెట్టుకుని పొలాల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పైప్‌లైన్ల పేరుతో రోడ్డును ధ్వంసం చేస్తే ఊరుకోం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మున్సిపాల్టీ పరిధిలోని అయిదో వార్డు ఐడిఏకాలనీలో ఇటీవల కొత్తగా సీసీరోడ్డు నిర్మించారు. అయితే మిషన్ భగీరథ పేరుతో జేసీబి వచ్చి రోడ్డును తవ్వేందుకు మంగళవారం ప్రయత్నం చేయగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీంతో జేసిబి వెనుదిరిగి పోయింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైప్‌లైన్లు పేరుతో ఎక్కడ పడితే అక్కడ తవ్వి వదిలి వేస్తుండటంతో ప్రమాదాలు సైతం జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక మీదట సీసీరోడ్డును తవ్వేందుకు వస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

గీతంలో త్యాగరాజ ఆరాధన వేడుకలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో మంగళవారం ప్రముఖ పురాణ స్వరకర్త త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని కళలు, ప్రదర్శనా కళల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంగీతం, నృత్యం ద్వారా త్యాగరాజ వైభవం- త్యాగరాజ కృతులు, అనుభూతి, శైలి, ఔన్నత్యాలను మరోసారి మననం చేసుకుని, ఆయనకు ఘన నివాళ్లర్పించారు. ఈ వేడుకలో గాయకులు డాక్టర్ నిర్మల్ హరీష్, మృదురవళి దర్భల త్యాగరాజ కీర్తనలతో సహా ఆకర్షణయమైన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డాక్టర్ వై.లలిత సింధూరి, పీబీ వైష్ణవిలు కూచిపూడి, అంజు అరవింద్ భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో త్యాగరాజుకు నివాళులర్పించారు. కాగా, చంద్రకాంత్ మృదంగంపై, మహావాది వాసు విశ్వనాథ్ శాస్త్రి వయోలిన్ తో వారికి సహకారం అందించారు. గాంధీ కూడలి నుంచి ఉత్సాహభరితమైన పల్లకీ సేవ (ఊరేగింపు)తో ప్రారంభమై, నామ సంకీర్తన యొక్క స్ఫూర్తిని చాటిచెప్పింది. భక్తులు సంగీతం ద్వారా తమ భక్తిని వ్యక్తపరిచే సంప్రదాయం, వారి కళకు గుర్తింపుగా వివిధ రూపాలలో సహకారం, మద్దతు పొందుతారు. ఈ ఆచారం త్యాగరాజ వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన ఆయన దివ్య నామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయాలతో గౌరవించబడ్డాయి. త్యాగరాజ వైభవం సంగీతం, నృత్యం, సంప్రదాయాన్ని అందంగా మిళితం చేసి, భారతదేశపు గొప్ప సంగీత సాధువులలో ఒకరికి గీతం ఆత్మీయ నివాళి అర్పించింది.

'సైబర్ బెదిరింపులకు నో చెప్పండి' వీధి నాటక ప్రదర్శన

సైబర్ బెదింపులను ఎదుర్కోవడానికి, సైబర్ నేరాల గురించి సమాజానికి అవగాహన కల్పించడానికి ఒక సృజనాత్మక ప్రయత్నం, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం చేసింది. 'సే నో టు సైబర్ బుల్లియింగ్' పేరిట వీధి నాటకాన్ని జే-బ్లాక్ ముందు ప్రదర్శించారు. ఆన్ లైన్ భద్రత గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పలువురు విద్యార్థులను ఇది ఆకర్షించింది. సైబర్ నేరాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి ఆచరణాత్మక దశలను ఈ నాటకం ప్రదర్శించి, అప్రమత్తత, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఏదైనా సైబర్ బెదిరింపు సంఘటలు జరిగితే, వాటిని ప్రత్యేక హాట్ లైన్ 1930కు ఫిర్యాదు చేయడం, లేదా cybercrime.gov.inని సందర్శించడం ద్వారా రక్షణ లేదా ఉపశమనం పొందవచ్చని ఆ నాటకం ద్వారా ఇచ్చిన సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన విద్యార్థి ప్రతినిధి అఫ్రీన్ మాట్లాడుతూ.. 'డిజిటల్ యుగంలో తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థులకు జ్ఞానం, సాధనాలతో సాధికారత కల్పించడమే మా లక్ష్యం. సురక్షితమైన ఆన్‌లైన్ సంఘాన్ని సృష్టించడానికి ఈ వీధి నాటకం మా చొరవల్లో ఒకటి' అని పేర్కొన్నారు. ఈ చొరవ విద్యార్థులు తమ చదువులో రాణించడమే కాకుండా, సమాచారం ఉన్న, చురుకైన పౌరులుగా మారేలా చేయడంతో పాటు, విద్యా నైపుణ్యాన్ని వాస్తవ ప్రపంచ సమస్యలతో అనుసంధానించడంలో గీతం నిబద్ధతను చాటి చెబుతోంది.





హరితహారం మొక్కల సంరక్షణ పట్టించుకోరా ?

నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటుతున్నా.. వాటి సంరక్షణ మాత్రం గాలికి వదిలేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయితీల్లో మొక్కుబడిగా మొక్కలు పెంచుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయంలో మొక్కలే ప్రాణవాయువు అని.. పదేపదే జిల్లా ఉన్నతాధికారులు సమావేశాల్లో చెప్పినప్పటికీ ఉపాధి హామీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం హరితహారం కార్యక్రమాలో ఆర్భాటంగా చేయడం తప్ప క్షేత్రస్థాయిలో మొక్కలపై ఈజీఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువరు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

క్యాన్సర్ పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి డీఎంఅండ్‌హెచ్ఓ ఆఫీస్‌లో న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూవారీ ఆహార అలవాట్లు, పనుల వల్ల క్యాన్సర్ వ్యాధి ప్రభులుతున్నదన్నారు. కాబట్టి ఆరోగ్యం జాగ్రత్త ఉంచుకొని ఆహార అలవాట్లు మార్చుకుని.. రోగాల బారి నుంచి దురంగా ఉండాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా టెస్ట్‌లు చేసుకొని తెలుసుకోవడం వల్ల చికిత్స చేయించుకోవచ్చు అని అన్నారు. అవగాహన వల్ల ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చని, గుర్తించడం, నివారణ చికిత్సా అనే మూడు మార్గాల ద్వారా ఈ వ్యాధిని జయించవచ్చన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురికావొద్దని, గురిచేస్తే చట్ట రీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ గాయత్రిదేవి, ఇంఛార్జి డీఎం అండ్ హెచ్ఓ డా.శశాంక్, డాక్టర్లు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలే గిరిజనుల దైవం

నవతెలంగాణ-జహీరాబాద్



నేటికీ గ్రామాల్లో చిరుధాన్యాలనే గిరిజనులు తమ దైవంగా భావిస్తారని పశువర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ కైలాష్ మన్నే అన్నారు. కోహిర్ మండలంలోని బిలాల్పూర్‌లో మంగళవారం జరిగిన పాత పంటల జాతరకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు నాటి నుంచే చిరుధాన్యాలనే దైవంగా భావించి పంటలు నాటేటప్పుడు, కోతకు వచ్చినప్పుడు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిరుధాన్యాలనే భుజించి పౌష్టికంగా ఎంతో గట్టిగా ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పురుషులు 100 ఏండ్ల వరకు బతుకుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. దానికి ప్రధాన కారణం పాత పంటల ఉత్పత్తులను తినడమేనన్నారు. కాగా పాత పంటల జాతర ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు బృందంతో కలిసి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతర కోఆర్డినేటర్ వినయ్ కుమార్ సంఘం సభ్యులు మాణిక్యం, నరసమ్మ రోజమ్మ, చిన్న నర్సమ్మ, చంద్రమ్మ ,అల్గోల్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

క్రీడాలు మానసిక ఉల్లాసానికి దోహద పడడమే కాకుండా.. శారీరక ధృడత్వాన్ని ఇస్తాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కర్, యువనేత సాగర్ సెట్కార్‌లు అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని అప్పారావు షేట్కార్ మినీ స్టేడియంలో ఓవర్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం రాత్రి ప్రారంభించారు. జాతీయ గీతాన్ని ఆలపించి కొద్దీ సేపు క్రికెట్ ఆడి టోర్నిని మొదలెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాలో గెలుపు, ఓటములు సహజం అని అన్నారు. కాగా పెద్ద ఎత్తున ప్రజలు యువకులు పాల్గొని మ్యాచ్ తిలకించారు. టోర్నమెంట్ మొదటి రోజు మొదటి మ్యాచ్‌లో భాగంగా లోకల్ బాయ్స్ వర్సెస్ జగనాథ్ పూర్ టీంలు తలపడగా జగనాథ్ పూర్ టీం విజయం సాధించారు. టోర్నమెంట్ నిర్వాహకులు భూపాల్, పవన్, నోమన్, సాయి చరణ్, సాయి దిగ్వాల్‌కు వారు అభినందనలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో మొరాయిస్తున్న సర్వర్

నవతెలంగాణ-వట్‌పల్లి



వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో గత 15 రోజులుగా సర్వర్ మొరాస్తుండడంతో పట్టాదారులు సతమతమవుతున్నారు. కొనుగోలు, అమ్మకముదారులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. సర్వర్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు నిలిచిపోతుందో అధికారులకు, ఆపరేటర్లకు కూడా తలనొప్పిగా మారుతున్నది. భూములు కొనుగోలు చేసిన వ్యాపారస్తులు.. విక్రయించిన రైతులు రిజిస్ట్రేషన్‌కు రెండ్రోజుల ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకొని రిజిస్ట్రేషన్ నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తే.. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10 నిమిషాల నుంచి నుంచి అర్ధగంటలోపు పూర్తి కావాల్సిన రిజిస్ట్రేషన్ పనులు.. సర్వర్ డౌన్ వల్ల గంటల తరబడి, ఒక్కొక్కసారి మరుసటి రోజు కూడా తిరిగి రావాల్సి వస్తోందని పలువురు మండి పడుతున్నారు. కాగా సర్వర్ సమస్య.. పైనుంచి తలెత్తడంతో తామేమి చేయలేమంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. సర్వర్ సమస్య లేనప్పుడు రోజుకు ఎన్ని అయినా రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవని.. కానీ ఈ సర్వర్ సమస్య వల్ల గంటల తరబడి నిరీక్షించక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. సర్వ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

బాధితులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి శివారులో వెలసిన శ్రీ పలుగు పోచమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను ఫారెస్ట్ ఆఫీసర్లు కూల్చివేశారు. కాగా బాధితులను మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మంగళవారం పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. బతుకుతెరువు కోసం చిరు వ్యాపారం చేసుకునే షెడ్లను కూల్చివేశారని న్యాయం చేయాలని కోరగా ఫారెస్ట్ ఆఫీసర్లతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం చేయాలని.. కూల్చిన షెడ్లకు నష్టపరిహారం అందించేలా చూడాలని పలుగు పోచమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ మల్ల గౌడ్ కోరారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు పలుకు పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులుకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ సుదర్శన్ గౌడ్, మణిదీప్, హకీమ్, శేఖర్ గౌడ్, వరల నర్సింలు, బిక్షపతి, ప్రవీణ్ గౌడ్, బాబా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ సందీప్, మాజీసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం

నవతెలంగాణ-అమీన్‌పూర్



సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని అర్హులందరికీ డబల్ బెడ్‌రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. స్థానిక మున్సిపల్ కమిషనర్‌కి పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలోనే దరఖాస్తులు చేసిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెన్షన్ల కోసం వందలాదిమంది అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే పెన్షన్లు పెంచి ఇస్తామన్న ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించా రు. అమీన్‌పూర్‌లో నిర్మితమై ఉన్న డబల్ బెడ్ రూమ్‌లను మున్సిపల్ పరిధిలోని అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నోటీసులు ఇవ్వకుండానే సరిహద్దులు


నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామ రెవెన్యూ శివార్‌లో గల సర్వే నంబర్లు 95, 108, 122, 123, 125లో లైఫ్‌స్టైల్ ప్రాజెక్ట్ వారు రైతులకు ఎలాంటి నోటీసులు ఇప్పించకుండా గతంలో అక్రమంగా సర్వే చేయించి హద్దులు నిర్ణయించుకున్నారని రైతు కృష్ణారెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 101, 102, 104, 105, 106, 122, 123, 125 సర్వే నెంబర్లలో లైఫ్ స్టైల్ ప్రాజెక్ట్ వారు సుమారు 22 ఎకరాల భూమి కొనుగోలు చేశారని.. అయితే ఈ సర్వే నంబర్లలో రైతులకు సుమారు 80 ఎకరాల భూమి ఉన్నదన్నారు. ఒకే సర్వే నెంబర్‌లోని భూమి పార్టిషన్ చేయాలంటే అందులోని రైతుల అంగీకారం తీసుకోవాలి.. కానీ దానికి విరుద్ధంగా లైఫ్ స్టైల్ ప్రాజెక్టు ప్రతినిధులు వివాదాలు సృష్టించి నక్ష బాటను, వరద కాలువలను కబ్జా చేసి అక్రమంగా మట్టిని తరలించి రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సర్వే నంబర్లు 105, 108, 122, 123, 125లో తనతోపాటు ఇతర రైతులకు భూములు ఉన్నాయన్నారు. కాగా లైఫ్ స్టైల్ ప్రాజెక్టు వారు సర్వే సరిగ్గా నిర్వహించలేదని ఆధారాలతో సహా అధికారులకు విన్నవించినా సర్వే నిర్వహించలేదన్నారు. దాంతో 20-10-2023న సర్వే రద్దు చేయాలని హైకోర్టుకు వెళ్లామన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం 16-1-2025న సర్వే నిర్వహించి తిరిగి 3-2-2025 సర్వే నిర్వహించారన్నారు. అధికారులు రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని... సర్వే నెంబర్ 102 నుండి 125 వరకు మొత్తం భూమి సుమారుగా 107 ఎకరాలు ఈ సర్వే నంబర్లలో లైఫ్ స్టైల్ ప్రాజెక్టు ప్రతినిధులకు (22.14) ఎకరాల భూమి మాత్రమే ఉన్నదన్నారు. తమ కుటుంబ సభ్యులకు మరియు ఇతర రైతులకు కలిపి సుమారు 66 ఎకరాల భూమి ఈ సర్వే నంబర్లో ఉన్నదని.. రైతులకు నోటీసులు ఇవ్వకుండానే గతంలో లైఫ్ స్టైల్ ప్రాజెక్ట్ వారు సర్వే చేయించుకుని గతంలో పనిచేసిన రెవెన్యూ, పోలీస్ అధికారుల అండాదండలతో రైతులపై బైండోవర్ కేసులు పెట్టించి తమ భూముల్లోకి తవనే వెళ్లకుండా చేశారన్నారు. హైకోర్టు తీర్పు, రికార్డుల ప్రకారం సమగ్ర సర్వే నిర్వహించి తమ భూములకు హద్దులు ఏర్పాటు చేసిబాధిత రైతులందరికీ న్యాయం చేయాలన్నారు.

సప్తముఖి పోచమ్మ దేవి ఉత్సవాలు

నవతెలంగాణ-కొండాపూర్



మండలంలోని తొగర్పల్లీ గ్రామంలో పోచమ్మ దేవి ఉత్సవాలు మంగళవారం కనుల పండుగ్గా సాగాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మ కర్త ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ,రాష్ట్ర ప్రజలు అందరు సుభిక్షంగా ఉండాలని శ్రీశ్రీశ్రీ సప్తముఖి పోచమ్మ దేవి దశమ వార్షికోత్సవ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయంలో మండప దేవతప్ హెూమాలు, రుద్ర హెూమం, మహాచండీ హెూమం, బలి ప్రధానం, మహాపూర్ణహుతి, సాయంత్రం బోనాలతో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మట్టి తవ్వకాలు

ప్రమాదకరంగా ప్రయాణాలు..



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మండలంలోని కారసగుత్తి నుంచి కారముంగి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా మట్టిని తవ్వుతున్నారు. దాంతో పెద్ద గుంతలు ఏర్పడి.. రోడ్డు ప్రమా దకరంగా మారుతున్నది. వర్షాలు పడితే నీరు నిలబడి చెరువు లాగా దర్శనమిస్తున్నది. ఈ నేపథ్యంలో వాహన దారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. చర్యలు తీసుకోవాలని.. రోడ్డు పక్కన మట్టి తవ్వకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను మంగళవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదని వాపోయారు. గ్రామాల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి పనులు చేశామని, అభివృద్ధి పనులకు అప్పులు తెచ్చి మరీ పనులు పూర్తిచేశామన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల తమ పై చాలా భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులు బిల్లులకు ఇవ్వమని అడిగితే అరెస్టులు చేయడం ఎంత వరకు సమంజసం అని, ప్రశ్నించే గొంతు కలను కాంగ్రెస్ ప్రభుత్వం అనిచి వేస్తుందని మండి పడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 05 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-శివ్వంపేట



బీజేపీ జిల్లా నూతన అధ్యక్షులుగా ఇటీవలే నియామకమయిన వాల్దాస్ మల్లేష్ గౌడ్‌ను శివ్వంపేట మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి ఆధ్వర్యంలో మండల కమలదళం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మనించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపులి రవి మాట్లాడుతూ నూతన జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ హయాంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధానకార్యదర్శి అశోక్ సాదుల, గుల్లయ్యగారి సుదర్శన్, ఎస్టి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి బిక్షపతి, కొండల్ రావు, మాజీ సర్పంచ్ గోప్య నాయక్, బొంది శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాసంపల్లి శ్రీధర్ గౌడ్, కిషోర్ రెడ్డి, దుబ్బ శేఖర్, నాగేందర్ రెడ్డి, చిన్న కృష్ణ, శంకర్ సుధాకర్, కృష్ణ, గిరి, మహేష్, నాగరాజు, రత్నాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పలు గ్రామాలకు ప్రభుత్వం నుంచి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నాయకులు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహాయంతో మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త సహకారంతో శివ్వంపేటకు చెందిన కర్రె అమూల్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.21 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త సహకారంతో భీమ్లాసక్రు తండా గ్రామపంచాయతీ పరిధిలోని గుగులోత్ మాలి, కేతవత్ జుమిలి, కేతావత్ దుర్గమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ అండ

- జీడిపల్లి మాజీ సర్పంచ్ పంపరి నాగేష్



నవతెలంగాణ-మనోహరాబాద్

మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని జీడిపల్లి మాజీ సర్పంచ్ పంపరి నాగేష్ పేర్కొన్నారు. జీడిపల్లి గ్రామంలో పూస మమతకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.26,000లు మంజూరు కాగా వారికి మంగళవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులను మంజూరు చేసి ఆదుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడిపల్లి గ్రామ సీనియర్ నాయకులు రాగం శ్రీనివాస్ గుప్తా, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సొల్లుగారి నవీన్ కుమార్ నాయకులు యాదగిరి, చందు, సాయికుమార్ , హరికాంత్ పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు

- పసుపుతో అమ్మవారికి అర్చన



నవతెలంగాణ-శివ్వంపేట

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా, దేశంలోనే ఎక్కడ లేని విధంగా నిర్మితమై, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం మహాపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు రుద్రయామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి, వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజలలో బగలాముఖీ ట్రస్ట్ అధికార సభ్యులు సూర్యకుమార్ గౌడ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు కామిని నగేష్, నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు ప్రకాష్, పత్రాల రాజుగౌడ్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, రాజీపేట కిషన్, ఆనంద్ పాల్గొన్నారు.

యావపూర్ అంగన్వాడీ కేంద్రంలో పలకల పంపిణీ

నవతెలంగాణ-తూప్రాన్



మండలంలోని యావాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రామస్తుడు కుతాడి నర్సింలు పలకలు, వాటర్ బాటిల్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం లోని చిన్నారులు మంచిగా చదువుకోవాలని, వారు భవిష్యత్తులో మంచి విద్యను పొందాలని ఆకాంక్షిస్తూ, తన సొంత నిధులతో చిన్నారులకు పలుకలు, వాటర్ బాటిల్‌లను పంపిణీ చేశానన్నారు. సరస్వతీ చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో పలకలపై అక్షరాలను వ్రాసి, వారితో దిద్దించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను, భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇన్నారెడ్డి, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను మెరుగుపరుచుకోవాలి

నవతెలంగాణ-మెదక్



జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ మండలములో బాలానగర్ ఏరియా నందు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి షెడ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజు మాట్లాడుతూ యూనిట్ పెట్టడం ద్వారా రైతుకు ఆర్థిక అభివృద్ధి చేకూరే లాభనష్టాలను, వ్యాపార లావాదేవీలను స్వయంగా మహిళా రైతు బి వీణను అడిగి తెలుసుకున్నారు. జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి మొదటి దశలో ఉన్న షెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకుని యూనిట్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఒక కోటి వ్యయంతో ఈ యూనిట్ ప్రారంభించాల్సి ఉండగా. ఇందులో లబ్ధిదారుని వాటా 10 లక్షలు కాగా, బ్యాంకు రుణం 40 లక్షలు ఉంటుందని చెప్పారు. యూనిట్ సబ్సిడీ 50 లక్షల లభిస్తుందన్నారు. 500 గొర్రెలు లేదా మేకలు 35 పొట్టేళ్లు, మేక పోతులతో కూడిన బ్రీడింగ్ ఫారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వారికి 'నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీమ్' ఎంటర్ప్రెన్యూర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించిందన్నారు త్వరితగతిన యూనిట్ ప్రారంభించి ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్ వెంకటయ్య, డాక్టర్లు లక్ష్మణ్, వినోద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుమల స్వామి వేడుకలు

- ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట

శ్రీ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండలం చల్మెడ గ్రామంలో గల తిరుమల బండపై బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు సందర్భంగా యజ్ఞం కాల్చడం, ఎడ్లబండ్లు తిరుగుట, పల్లకి సేవ, రథం తిరుగుట కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చారిత్రాత్మక చరిత్ర కలిగిన దేవాలయానికి రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. స్వామివారి దీవెనలు మెదక్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ , ఆలయ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు బాజ రమేష్, తుమ్మల రమేష్, కాకి రాజయ్య, పెద్దపైడి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు చెప్పెట ముత్యంరెడ్డి, అమరసేన రెడ్డి, పంజా మహేందర్, సప్ర బాత్ రావు, మారుతి, నజిరుద్దీన్, వెంకట్ గౌడ్, లింగం గౌడ్, సత్యనారాయణ రెడ్డి,లక్ష్మణ్, మధుసూదన్ రెడ్డి, అబ్బా రెడ్డి, దేశెట్టి సిద్దారములు, మహేష్, రమేష్, రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని పాఠశాలలో చేర్పించిన. సీఆర్పీ రాధా గోపాల్

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు బ్రాహ్మణపల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు వెళ్లి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు చదువు మాని ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిఆర్పి. రాధా గోపాల్ అచ్చంపేటలోని విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పాఠశాలలో చేర్పించారు.



జీఎంఆర్ ఆధ్వర్యంలో గురుకుల ప్రవేశ పరీక్ష పుస్తకాల పంపిణీ

- జాతీయస్థాయి రంగోత్సవ పోటి విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

నవతెలంగాణ-వెల్దుర్తి

జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న మాసాయిపేట మండలం పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. పాఠశాల నుంచి గత నెలలో నిర్వహించిన జాతీయస్థాయి రంగోత్సవం కార్యక్రమంలో 34 మంది పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ఏడుగురు సిల్వర్ మెడల్స్, ఇద్దరు బ్రాంచ్ మెడల్స్ గెలుపొందారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రశంస పత్రాలను జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్ కుమార్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదివి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, అలాగే పాఠశాలలో చదువుతోపాటు చదివేతర అంశాల పైన చిత్రలేఖనం, పాటలు పాడడం, నృత్యం ఆటలు ఉపాధ్యాయులు నేర్పించడం వలన మానసిక దృఢంగా మారి విద్యార్థులు చదువులో కూడా ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్రావు, పిల్లల తల్లిదండ్రులు మనోహర్, గణేష్, సుగుణ, సాగర్, హరి సింగ్ పాల్గొన్నారు



ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమే ఆరోగ్యశ్రీ పథకం

- ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్,
- కవి రచయిత తప్పెట్ల రమేష్ ఎం.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్ : ఎస్సీల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తూ మాదిగ జాతిని ముందుండి నడిపించిన ఘనత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు దక్కుతుందని జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, కవి,రచయిత జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రమేష్‌లు అన్నారు. మంగళవారం మండ ల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో మండల కేంద్రంలో ఫిబ్రవరి 7న లక్షల డప్పుల వేల గొంతుల కార్యక్రమంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిన్నపిల్లల గుండె ఆపరేషన్ల కోసం 2007వ సంవత్సరంలో ట్యాంక్ బండ్ మీద వేలాది చిన్నారులతో చేసిన ఉద్యమ ఫలితమే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువుల కోసం పెన్షన్లు పెంచాలని అనేక పోరాటాలు ఉద్యమాల ద్వారానే తమ హక్కులు సాధించుకుంటామని 30 ఏళ్లుగా ఎస్సీల వర్గీకరణ కోసం పోరాటం చేసి సుప్రీం కోర్టు ద్వారా వర్గీకరణను సాధించిన ఘనత కూడా మంద కృష్ణ మాదిగకు దక్కుతుందని తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్లో నిర్వహించే లక్షల డప్పుల, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బ్యాతోల్ గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా టీ ఏసేపు, ఉపాధ్యక్షులుగా యాదగిరి, రాజు, ప్రధాన కార్యదర్శిగా టి. అరుణ్, కార్యదర్శులుగా రవి, ప్రభాకర్, గడ్డం దావీదు, కోశాధికారిగా టి.రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా టి.కృపానందం, గౌరవ అధ్యక్షునిగా మాజీ సర్పంచ్ టి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా గడ్డం సురేష్, టి యాదగిరి ఎన్నికైనట్లు వారు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందించుకోవచ్చు

- టాస్ వేసి క్రీడలను ప్రారంభించిన పైడి శ్రీధర్ గుప్తా



నవతెలంగాణ-నర్సాపూర్: క్రీడలతో ఒకరి మధ్య ఒకరి స్నేహభావం పెంపొందుతుందని ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తా అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత పది రోజులుగా జరుగుతున్న సీఎం క్రికెట్ కప్‌లో భాగం గా మంగళవారం సంగారెడ్డి, దౌల్తాబాద్ జట్ల మధ్య పోటీ జరగగా ముఖ్యఅతిథిగా శ్రీధర్ గుప్తా హాజరై టాస్ వేసి



క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో సీఎం కప్ ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆయన గుర్తు చేశారు .క్రీడాకారులు ఎటువంటి భేదాభి ప్రాయాలు లేకుండా కలిసిమెలిసి ఆడాలని గుర్తు చేశారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడినవారు బాధపడకుం డా విజయం సాధించే దుకు ప్రయత్నిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు రిజ్వాన్, రషీద్, సురేష్ నాయక్, అశోక్, సాగర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడీ టీవీ బహుకరణ

- రూ.30 వేలతో అందించిన దాత పబ్బ మహేష్ గుప్త.

నవతెలంగాణ-శివ్వంపేట

మండల కేంద్రమైన శివ్వంపేట హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల భవిష్యత్ కోసం జిల్లా పరిషత్ మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన స్వంతంగా రూ.30 వేలతో ఎల్ఈడి టీవీని మంగళవారం గ్రామకమిటీ అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, మాజీ ఉపసర్పంచులు బాసంపల్లి రామగౌడ్, పద్మ వెంకటేష్, వంజరి కొండల్, బాసంపల్లి పోచగౌడ్, లక్ష్మీనారాయణ, పంబల్ల సంతోష్, కోవూరి వెంకటేష్, ముయ్యడి జ్యోతి సింహం చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదివే పేద విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు సులువుగా అర్థమయ్యే విధంగా ఉండేందుకు ఎల్ఈడి టీవీని అందించడం జరిగినదన్నారు. పాఠశాలకు మరే సహకారం కావాలన్నా గాని తన స్వంతంగా అందజేస్తానన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా ఎల్ఈడి టీవీ అందించిన దాత మహేష్ గుప్తకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు దొడ్ల అశోక్, ఒర్రె శ్రీనివాస్,వర్గంటి రమేష్ గుప్త, బాసంపల్లి సుదర్శన్ గౌడ్, పంబల్ల భూమేష్, త్రినేష్ గౌడ్, ఖదీర్, బానూరి నాగరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ఆదుకునే కౌన్సిలర్ అరుణ వెంకటన్న

- అభినందన సభలోఅంబేద్కర్ సంఘం నాయకులు

నవతెలంగాణ-తూప్రాన్

మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లిలో అంబేద్కర్ సంఘం నాయకులు నిర్వహించిన అభినందన సభలో కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్ గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్‌గా పడాల పల్లిలో ఎన్నో అభివృద్ధి పనులను చేశారని, వారి సేవలను కొనియాడారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా 108 లాగా రాత్రి పగలు తేడా లేకుండా గ్రామస్తులకు అందుబాటులో ఉండే వ్యక్తి కౌన్సిలర్‌గా ఉండడం తమ అదృష్టమని అంబేద్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. 11వ వార్డు లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు,రోడ్లు డివైడర్లు వంటి ఎన్నో రకాల అభివృద్ధి పనులను చేపట్టి సకాలంలో పూర్తి చేశారని కొనియాడారు. వెంకటన్న అని ఎవరైనా తన వద్దకు వస్తే, ప్రతి ఒక్కరికి ఏదో ఒక రకంగా సహాయ సహకారాలు అందించే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. గడిచిన 5 సంవత్సరాల కాలంలో, కరోనా సమయంలో కౌన్సిలర్‌గా అరుణ వెంకట్ గౌడ్ అందించిన సేవలు గ్రామస్తులు ఎప్పటికీ మర్చిపోలేరని గుర్తు చేశారు. అంబేద్కర్ సంఘం నాయకులు ఒక్కొక్కరుగా మాట్లాడుతూ కౌన్సిలర్‌గా చేసిన సేవలపై ప్రశంసలు కురిపించారు. కౌన్సిలర్ దంపతుల చిత్రపటాన్ని బహుమతిగా అందజేశా రు. ప్రజా నాయకుడిగా, ప్రజల మన్ననలు పొందిన ప్రజా సేవకుడిగా, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పార్టీలకు అతీతంగా పనిచేసే కౌన్సిలర్‌గా, చురుకైన యువకుడిగా, అధికారులతో కలుపుగోలు వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా అందరి మన్ననలు పొందారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు ఉన్నత పదవులు పొందాలని అంబేద్కర్ సంఘం నాయకులు ఆకాంక్షించారు.



పార్టీల నాయకులతో ఎంపీడీఓ సమావేశం

నవతెలంగాణ-నార్సింగి



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళశారం అన్ని రాజకీయ పార్టీలతో గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాపై ఎంపీడీవో ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు కొత్తగా చేర్చిన ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకొని గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారితో పాటుగా మండల వ్యాప్తంగా పురుషుల ఓట్లు 6467 ఉండగా మహిళలు 7037 ఉన్నారని, మొత్తం మీద 13504 ఓటర్లు ఉన్నారని, మండల కేంద్రమైన నార్సింగిలో 5792 ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరు స్థానిక ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు లోనూ కాకుండా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం జరిగే ఎన్నికలలో ఎన్నికలు సజావుగా జరపడానికి అన్ని పార్టీల నాయకులు తమ సహాయ సహకారాలు అందజేయాలని నాయకులతో ఎంపిడిఓ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, తాజా మాజీ జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు అంచనూరి రాజేష్, జహీర్, బీజేపీ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, కుమ్మరి నర్సింహులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత పెద్ద తాండా

నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని పెద్ద తాండాలో సేవా లాల్ జగదాంబ 14వ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద తాండా యువకులు నరేష్, మహేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఆటల పోటీలకు ముందు దేవాలయంలో పూజారులు, తాండా వాసులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేలారం బాబు సేవా లాల్ దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని దీవెనలు పొందారు. కబడ్డీ పోటీలలో జిల్లా వ్యాప్తంగా నుంచి పాల్గొన్న 30 జట్లలో లలో ఫైనల్ చేరుకున్న పెద్ద తాండా, కొడపాక జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. దేశ భవిష్యత్తు యువకుల పైనే ఆధారపడి ఉందని, యువకుల తోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. యువత చదువు ఆటలతో పాటు గ్రామ అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలన్నారు. జిల్లా స్థాయి నుంచి కబడ్డీ పోటీలలో పాల్గొన్న 30 జట్లలో ఫైనల్‌కు చేరుకున్న ఇరు జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆటలను క్రీడా స్ఫూర్తితో ఆడాలని, నైపుణ్యం, ప్రతిభను చాటి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఫైనల్ పోటీలో విజేతలుగా నిలిచిన పెద్ద తాండా జట్టుకు నగదు బహుమతి, కప్పు ను, ద్వితీయ స్థానంలో నిలిచిన కొడపాక జట్టుకు కూడా బహుమతి, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ క్షత్రియ, పెద్ద తాండా అధ్యక్షుడు భాష నాయక్, నితిన్, అశోక్, నరేష్, చందర్ మహారాజ్, మంగ్య మహారాజ్, తాండా నాయక్ సోమ్లా, జగన్, పీఈటి నవీన్, పాల్గొన్నారు



కమనీయంగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం

- ముగిసిన మల్లన్న జాతర ఉత్సవాలు.

నవతెలంగాణ-శివ్వంపేట

అట్టహాసంగా మొదలై గత నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో, గ్రామస్తుల సహకారంతో మండలంలోని పిల్లుట్ల గ్రామంలో నిర్వహించిన మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం శ్రీరేణుక ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణతో పరిసమాప్తమయ్యాయి. చివరి రోజు రేణుకమాతకు బోనాల సమర్పణకు గ్రామం నుంచి యాదవ కులస్తుల ఇండ్ల నుంచి గంపల ఊరేగింపు ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారి దేవాలయంకు తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను శుద్ధిగా తయారు చేసి గుడి చుట్టూ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఎల్లమ్మ తల్లికి బోనాల నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి, రేణుక ఎల్లమ్మ దయతో మండల ప్రజలు, గ్రామస్తులు ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు నాగయ్య, మల్లయ్య, ఆయిలయ్య, అంజయ్య, నర్సిములు, గోనయ్య, నాగయ్య, బిక్షపతి, కిష్టయ్య, మల్లేష్, బబ్బురి మల్లేష్, మానయ్య శ్రీనివాస్, వెంకటేష్, మహేష్, రాములు, మంగళపర్తి స్వామి, మల్లేష్, శ్రీశైలం, పార్వతాలు, పోచయ్య, శ్రీనివాస్, బబ్బురి శ్రీశైలం, అశోక్, ములకల రాజయ్య, పాల్గొన్నారు



సెంట్రల్ డ్రగ్ స్టోర్ల ఆకస్మిక సందర్శన



- డీఎం అండ్ హెచ్ఓ

నవతెలంగాణ-సిద్ధిపేట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ మంగళవారం జిల్లాలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా స్టోర్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ముందుగా జిల్లా స్టోర్‌ను సందర్శించి మందుల నాణ్యతను, రికార్డులను, గడువుకు ముందున్న మందులపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యాక్సిన్ స్టోర్‌లోని వాక్సిన్ శీతలికరణ స్థితిని పరిశీలించారు. అనంతరం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ని సందర్శించి సిబ్బందితో మాట్లాడుతూ మందుల నిలువలను సక్రమమైన పద్ధతిలో భద్రపరచాలని, కూల్ రూమ్‌లో ఉంచాల్సిన మందులపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కచ్చితంగా నెలకు ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, మందులను పంపించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు, వారికి కావలసిన ఇండెంట్‌ని ఫార్మసిస్టు ద్వారా ఈ ఔషధీ పోర్టల్ ద్వారా ఇండెంట్ సరఫరా కొరకు సెంట్రల్ డ్రగ్స్టోర్ కు పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ నవీన్ రాజ్ కుమార్, సిబ్బంది అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, మక్సుధల్లి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-వర్గల్

అడవిపందులు బెడద, పంటలసంరక్షణ, మిరప పంటలో తెగులు, నివారణ చర్యలు తధితర అంశాల పైన మంగళవారం వర్గల్ మండలంలోని తునికిఖల్సా రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వార రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణీ రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో నెరుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేతలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారిణీ శేషశయన, ఏఈఓ ధర్మేందర్, రైతులు పాల్గొన్నారు. అనంతరం డిజిటల్ విధానంలో పంటల నమోదు కార్యక్రమాన్ని తునికిఖల్సా, సింగాయిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పరిశీలించారు. ఏఈఓలు అందరు కూడ త్వరితగతిన యాసంగి పంటలు అన్నీ కూడా నమోదు చేయాలని సూచించారు.

కార్మికుల హాజరును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-సిద్ధిపేట

మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ కార్మికుల హాజరును మంగళ వారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త ఇవ్వని వారి వివరాలను సేకరించి, వారు చెత్తను ఎక్కడ వేస్తున్నారో గమనించాలని, బహిరంగ ప్రదేశాల్లో వేసేవారికి జరిమానా విధించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా, ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరు కూడా ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగిస్తూ, ఆదర్శంగా నిలుస్తూ, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు.

మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చల్లారం వెంకట్రా మిరెడ్డి గత ఏడు రోజుల క్రితం కారు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బీఆర్ ఎస్ మండల నాయకులు, నంగునూరు మండలం ఇంచార్జి గుండు భూపేష్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, సొసైటి చైర్మెన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు గోవిందారం రవిలు మృతుని కుటుంబ సభ్యులు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లను పరామర్శించి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎల లతా కృష్ణ మల్యాల నర్సింహులు, మాజీ ఎంపీటీసీ కలకుంట్ల నర్సింహులు, రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపా రు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ, ఇంటి, నల్ల బిల్లుల వసూళ్ళ, నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీలో రోడ్డు పరిశుభ్రతంగా ఉండటం ఎలాంటి వ్యాధులు రావన్నారు. డ్రైనేజ్ క్లీనింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్థిక ఏడాది సమీపిస్తున్న నేపథ్యంలో నల్ల కలెక్షన్లు, ఇంటి బిల్లుల వసూలు ముమ్మరంగా చేయాలని సిబ్బందికి సూచించినట్టు చెప్పారు. దానికి ప్రజలు సహకరించాలన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి లో 5, 6 వార్డులో అండర్ డ్రైనేజీ సమస్య ఉన్న చోట పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు. సంగుపల్లి గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణం పనుల విషయంలో చర్యలు తీసుకుంటున్న ట్లు ఆయన చెప్పారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు బండి నర్సింలు



నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్

గుజరాత్ రాష్ట్రంలో మార్చి 3వ తేదీన జరిగే జాతీయస్థాయి ఈత పోటీలకు సిద్ధిపేట జిల్లా వాసి బండి నర్సింలు ఎంపికయ్యారు. హైదరాబ ాదులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఈవి నరసింహారెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు బండి నరసింహులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో విజేతగా నిలిచి డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని అభినందించారు.

తహసీల్దార్‌ను కలసిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మండల నూతన తహసీల్దారు ప్రవీణ్ రెడ్డి ఇటీవల భాద్యతలు స్వీకరిం చిన విషయం తెలిసిందే. మంగళవారం బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయి రెడ్డి రాంరెడ్డి, బీజేపీ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తహశీల్దారుకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సన్మానించారు. తహసీల్దారు కలసిన వారిలో బీజేపీ నాయకులు టి.రమేష్ గుప్తా, సాయిరెడ్డి శంకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణ, తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అండగా నిలవాలని అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో ఒకరికి సర్పంచ్‌గా అవకాశం వస్తే మరొకరికి ఎంపీటీసీగా అవకాశం ఉంటుందని మరొకరికి పార్టీ పదవుల్లో న్యాయం జరుగుతుంది కాబట్టి అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మహ్మదపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి , బొల్లి తిరుపతి లు కూచనపల్లి గ్రామానికి చెందిన గూల్ల చంద్రమౌళి ఇతరులు వివిధ పార్టీల నుంచి ఆయన ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మదన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఇందూర్‌లో ఫైనల్ ప్రీమియం లీగ్ మ్యాచులు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఇందూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీపీ రాజు అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం గ్రామ శివారులోని ఇందూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ఇందూర్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫైనల్ మ్యాచులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట ఇంటర్మీడియట్ విద్యార్థులు, ఇందూర్ కళాశాల విద్యార్థులు మొత్తము 10 టీములు పాల్గొన్నారు. ఇందులో ఫైనల్‌లో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ సిద్దిపేట, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మిరుదొడ్డి విద్యార్థులు పాల్గొన్నాగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ సిద్దిపేట్ విద్యార్థులు మొదటి స్థానం లో, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మిడిదొడ్డి విద్యార్థులు రెండో స్థానంలో గెలుపొందారు. మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, మిరుదొడ్డి. రేపాక ప్రదీప్ రెడ్డి చైర్మెన్ ఇందూరు కాలేజ్ మరో కిరణాలు న్యూస్ పేపర్, చీఫ్ ఎడిటర్ మేనేజింగ్ డైరెక్టర్ తెలియజేసిన విధముగా, విన్నర్ కు రూ.5వేల రివార్డు, మేమేంటో, రన్నర్ కి రూ.2500 రివార్డు, మేమెంటో, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.1000 రివార్డు మెమొంటోలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, బొడ్డు రఘు పీఆర్‌ఓ, ఫిజికల్ డైరెక్టర్ సంతోష్, ఎండి సల్మాన్, పోచయ్య, మాకు మహేష్, ఇతర డిపార్ట్మెంట్ హెచ్వోడీస్‌లు తదితరులు పాల్గొన్నారు.

కులాలపై వాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమే..

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వాఖ్యలపై రెడ్డి జేఏసీ మండిపాటు
- ఎమ్మెల్సీ వాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ వినతిపత్రం
- తీన్మార్ మల్లన్నను బర్తరఫ్ చేయాలని డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

ఒడ్డుక్కెకా ఓడ మల్లన్న..ఒడ్డుదిగాక బోడ మల్లన్న అనే చందంగా తీన్మార్ మల్లన్న వ్యవహారముందని, రాజ్యాంగ బద్ధమైన ఎమ్మెల్సీ హోదాలో కొనసాగుతూ రాజ్యాంగ విరుద్ధంగా కులాలపై వాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి జేఏసీ మండలాధ్యక్షుడు ముక్కీస తిరుపతి రెడ్డి మండిపడ్డారు. వరంగల్ పట్టణంలో నిర్వహించిన బీసీ యుద్ధభేరి సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మెల్సీగా ప్రాధాన్యత కల్పించిన రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం మలన్నను భర్తరఫ్ చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి రెడ్డి జేఏసీ అధ్వర్యంలో వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెడ్డి సామాజిక వర్గం సమాజంలోని అన్ని కులాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ జీవనం సాగిస్తారని, తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజిక వర్గంపై వాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీసీ సామాజిక వర్గాల సమన్యాయానికి తీన్మార్ మల్లన్న న్యాయబద్ధమైన పోరాటాలను స్వాగతిస్తామని, ఇతర కూలాలపై వాఖ్యలు చేయడం ఖండిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కవ్వ లింగారెడ్డి, రెడ్డి జేఏసీ నాయకులు చెన్నాడీ సుధాకర్ రెడ్డి, నారెడ్డి సుదర్శన్ రెడ్డి, రామలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న ఛలో హైదరాబాద్‌కి తరలిరండి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవి.చలపతి రావు

నవతెలంగాణ-సిద్ధిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవి.చలపతి రావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విక్టరీ టాకీస్ వద్ద ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అంటూ తెలంగాణ ప్రజానీకానికి ఆరు గ్యారెంటీలను హామీలు, వాగ్దానాలు ఇచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 14 నెలలు గడుస్తున్నా కూడా ఏ ఒక్క హామీ నెరవేరలేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు మినహా మిగిలిన ఐదు గ్యారెంటీల్లో కొన్ని ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. రేవంత్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాల అమలు కోసం ఫిబ్రవరి 20న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చింతా భూమేశ్వర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నేతలు ఆకుల రాములు, గంగాధర్, రాణా ప్రతాప్, నిరంజన్, అనిల్, విజయ్ కుమార్, ప్రశాంత్, ఉదయ్, పాల్గొన్నారు.



యువత సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్



నవతెలంగాణ-గజ్వేల్

యువత సృజనాత్మకతను పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ (అటోనామస్) ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం కళాశాలలో మంగళవారం 'కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విభాగం' ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ నూతన ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే విధంగా పారిశ్రామికవేత్తలుగా రూపుదిద్దుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. యువతను సన్మార్గంలో ప్రోత్సహించే విధంగా వారి ఆలోచనలను వారి భవిష్యత్తుకి ఉపాధికి ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమం రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ విద్యార్థుల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఈ పథకం ఉద్దేశించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ డి. వెంకటేష్, కార్యక్రమ సమన్వయకర్త జే. లక్ష్మీ నర్సయ్య, మెంటార్స్ కెప్టెన్ డా. భవాని డా.కవిత, మార్కండేయ, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

- వ్యవసాయ కూలీ చేస్తూ డాక్టరేట్ సాధించడం గర్వకారణం
- ధర్మారం గ్రామ యువకుడి సత్తా



నవతెలంగాణ-మిరుదొడ్డి

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించాడు గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థి. తల్లితండ్రులు వ్యవసాయం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తుంటే వారి కష్టాలను చూసి ఏదైనా సాధించాలనే సంకల్పంతో చదువుతూ, నేడు డాక్టరేట్ పట్టాను పొంది అనుకున్న లక్ష్యానికి చేరుకున్నానని డాక్టర్ వేణు తెలిపారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన వర్ధ వేణు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఉస్మానియా తెలుగు శాఖలో ఆచార్య సాహి కమలాకర్ శర్మ పర్యవేక్షణలో "తెలుగు కవిత్వం-పర్యావరణ స్పృహ" (2000-2020) అనే అంశంపై పీహెచ్‌డీపూర్తి చేయడం జరిగిందన్నారు. చిన్నప్పటి నుంచి ఏదైనా సాధించాలనే ఉద్దేశ్యంతో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదవడం ద్వారానే నేడు డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సైతం లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని పట్టుదలతో చదవాలని సూచించారు. తన చదువుకు సహకరించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్లు కమలాకర్ శర్మ, డాక్టర్ రఘు, ప్రొఫెసర్ కాసిం, డాక్టర్ విజయలక్ష్మి,తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నిత్యానందరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా సామూహిక సూర్య నమస్కారాలు



నవతెలంగాణ-సిద్ధిపేట


రథసప్తమి సందర్భంగా కోమటి చెరువు రూబీ నెక్లెస్‌పై సూర్యునికి నమస్కారాలతో యోగ సాధకులు సామూహిక నమస్కారాలతో స్వాగతం పలికారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ, సిద్ధిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో యువకులు, యువతులు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు. యోగ శిక్షకురాలు తోట సంధ్య ఆదిత్య శ్లోకంతో రథసప్తమి వేడుకలను ప్రారంభించారు. బాలికల ఉన్నత పాఠశాల మినీ స్టేడియంలో ఈనెల 9న నిర్వహించే శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన, రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలో యోగ సాధకులు, ఆరోగ్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని యోగా శిక్షకులు తోట సతీష్ పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే వారికి సర్టిఫికెట్ , మెడల్ అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, సిద్ధిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రెస్ అకాడమీ పూర్వ సభ్యులు కే. అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దృష్టి పెట్టాలి



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ కేంద్రంలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు వాటి విషయంలో పెద్దగా స్పందించలేదు. కేసీఆర్ ఎమ్మెల్యేగా పరిష్కారం ఆయననే చేయాలని సమస్యల విషయంలో పెద్దగా స్పందించినట్లు కనిపించడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా సింహభాగం సీసీ రోడ్లు, మురికి కాలులు లేక కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్లు సైతం నిధులు లేక పూర్తికాలేదు. నియోజకవర్గ కేంద్రంలో విద్యాలయాల నిలయం పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోయాయి. విద్యాలయాలకు అటెండర్, స్లీపర్లు లేకపోవడం వల్ల మున్సిపల్ సిబ్బందిపై ఆధారపడడంతో పనులు కావడం లేదు. ఇటీవల ప్రభుత్వ బాలుర, బాలికల డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకులు స్థానిక మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నరసయ్యకు కలిసి వినతి పత్రాలు అందించారు. కానీ సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని ప్రజలు అంటున్నారు. గజ్వేల్ ముఖ్య నాయకులు గజ్వేల్ పట్టణంలో పర్యటించినప్పుడు సమస్యలు గుర్తించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధానంగా సమస్యలు

మున్సిపల్ చుట్టూ రింగ్ రోడ్డు 60 మీటర్ల మేరకు, కోట మైసమ్మ రోడ్డు, పిడిచెడు, వర్గల్ ముట్రాజ్ పల్లి రోడ్లవిస్తరణ పెండింగ్లో ఉన్నాయి. సంస్కృతి, ప్రభుత్వ సమావేశాల నిర్వహణ, విద్యార్థులకు కళా ప్రదర్శనలు, సమేశాల కోసం గజ్వేల్ లోని బాలబాలికల విద్యా సౌధలో నిర్మించిన అనుటోరియాలు చెత్తాచెదారం గా మారింది. పర్యాటక అభివృద్ధిలో భాగంగా గజ్వేల్ పాండవుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన టూరిజం స్పాట్ పూర్తిగా నిర్వీరమైంది. క్రీడా సామాగ్రి పూర్తిగా పరికరాలు విరిగిపోయాయి. ప్రజ్ఞాపూర్, అమ్మది పూర్ గ్రామ చెరువుల సుందరీకరణ పూర్తికాలేదు. అర్బన్ పార్క్ లో పర్యటన కాటేజీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండు పడకల గదుల పంపిణీ కోసం గజ్వేల్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన పనికి ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇందులో అప్పగించడంలో నిర్లక్ష్యం అవుతుంది. ఇలాంటి సమస్యలు చాలావరకు ఉన్నాయి. వీటిని పరిష్కరించవలసిన అవసరం ఉంది.

ఎంఆర్ఓను కలిసిన బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షుడు



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల నూతన తహసీల్దారుగా షేక్ ఆరీఫా ఇటీవల భాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మర్కుక్ మండల బీజేపీ అధ్యక్షులు సాయి రెడ్డి రామ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తహసీల్దారుకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సన్మానించారు. కలసిన వారిలో ఆయనతో పాటు ములుగు మండల నాయకులు చింతల అశోక్ తదితరులున్నారు.

అదుపుతప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లిన కారు



నవతెలంగాణ-రాయపోల్

అదుపుతప్పి కారు రోడ్డు కిందికి దూసుకెళ్లిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొత్తపల్లి బస్టాండ్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన శేరి మహేష్ తన కారులో వరి పొలంలో ఎరువులు వేయడానికి యూరియా, గుళికలు మందులు తీసుకురావడానికి రాయపోల్‌కు వచ్చి వాటిని తీసుకొని తిరిగి వెళుతుండగా కొత్తపల్లి బస్టాండ్ సమీపంలో తన పొలం వద్దకు వెళ్లే క్రమంలో అదుపుతప్పి కారు పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం



నవతెలంగాణ-రాయపోల్


విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు అన్నారు. మంగళవారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు గ్రామ సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి చదువుతోపాటు క్రీడలలో రాణించినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని క్రీడలు శారీర ధృఢత్వానికి మానసిక ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు నైపుణ్యత పెంపొందుతాయన్నారు. పాఠశాల క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసిన సీనియర్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు స్వామి, కనకయ్య, నరేష్, ప్రవీణ్, కుమార్, పర్శరాములు పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్.



నవతెలంగాణ-తొగుట : మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ మండలంలోని గుడికందుల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సంద్భంగా ఎంఈఓ నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాలము విధానం ద్వారా పరీక్ష రాశారన్నారు. ఇలాంటి ప్రతిభా పోటీలు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రతిభా పోటీలో గుడికందుల ఉన్నత పాఠశాల విద్యార్థి ఎడ్ల పవన్ కుమార్‌కు ప్రథమ, ద్వితీయ బహుమతి ఎల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాల విద్యార్థి గంట అక్షయ్ కుమార్ ద్వితీయ, ఘనపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని పుల్లగూర్ల శీర్షిక తృతీయ స్థానంలో బహుమతులు సాధించారు. ప్రధానోపాధ్యాయులు పి. అంజిరెడ్డి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు టి. హనుమారెడ్డి, లక్ష్మయ్య, గోవర్ధన్ రెడ్డి, నవీన్ కుమార్, కిష్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు.

మూర్ఛ రోగంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-చేగుంట: వరి పంట పొలంలో ఎరువు చల్లుతూ మూర్ఛ రోగంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామం వరి పంట పొలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి నర్సింలు (32) ఈ నెల 3 తేదీన వరి పంటలో ఎరువు చల్లుచుండగా మూర్ఛ రోగం వచ్చి పడిపోయాడు. వెంటనే అతని భార్య స్థానికులకు ఫోన్ చేసి తూప్రాన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, మూర్ఛ రోగంతో మరణించాడని డాక్టర్లు తేల్చారు. పోలీసుల కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువకుని మృతి



నవతెలంగాణ-దుబ్బాక : ఒంటరిగా ఉంటున్న ఓ యువకుడి మృతదేహం కుళ్ళిపోయి అనుమానస్పద స్థితిలో ఉండడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ కేంద్రంలోని 14 వ వార్డులో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వీ.గంగరాజు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన కారంపూరి గణేష్ (38) గ్లాస్ ఫిట్టింగ్ పని చేసుకుంటూ తన సొంతింటిలోనే ఒంటరిగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. కొద్దిరోజులుగా ఆ యువకుడి నుంచి ఫోన్ రాకపోవడంతో పట్టణానికి చెందిన కారంపూరి లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం వాకింగ్ వెళ్లే సమయంలో గణేష్ ఇంటికి వెళ్లి చూడగా.. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించాడు. వెంటనే గణేష్ సోదరికి ఫోన్ చేసి చెప్పాడు. సోదరి వచ్చిన వెంటనే అందరూ కలిసి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి గణేష్ అనుమానాస్పదంగా కుళ్ళిపోయిన స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో ఆధారాలు సేకరించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా మహా శివుని శోభాయాత్ర



నవతెలంగాణ-సంగారెడ్డి

రథ సప్తమి పురస్కరించుకుని శివ స్వాముల భక్త బృందం ఆధ్వర్యంలో మహాదేవుని రథ యాత్ర ఘనంగా నిర్వహించారు. మంగళవారం పొత్తిరెడ్డిపల్లి శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయం నుంచి పాత బస్టాండ్ సోమేశ్వర వాడ శివాలయం వరకు మహా శివుని శోభా యాత్ర నిర్వహించారు. అంతకుముందు శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ ప్రజ్వలన, అఖండ మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ శోభా యాత్రలో గురు స్వాములు కర్యం మల్లేశం, లడే బాలు, సార శ్రీనివాస్, రఘు, లాడే శ్రీశైలం, అడివయ్య, విష్ణు, శివ స్వాములు, భక్తులు భారీగా పాల్గొన్నారు.

అందమైన చేతిరాత ఒక కళ

-మనసు పెట్టి నేర్చుకుంటే అందరికీ సాధ్యమే
-ఎంఈఓ ప్రభుదాస్



నవతెలంగాణ-దుబ్బాక

అందమైన చేతిరాత ఒక కళ లాంటిదని, మనసుపెట్టి నేర్చుకుంటే అది అందరికీ సాధ్యమవుతుందని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ చెప్పారు. మంగళవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధి దుంపలపల్లి వార్డులోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్‌చే విద్యార్థులకు చేతిరాతను మెరుగుపర్చుకోవడం పట్ల శిక్షణ కల్పించారు." అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే" అన్న పుస్తకం ద్వారా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అందంగా ఎలా రాయాలో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎజాజ్ అహ్మద్‌ను అలాగే పాఠశాలకు రూ.10 వేల ఆర్థిక సహకారాన్ని అందించిన బిజ్జ లక్ష్మణ్,బోయ రాములుకు ఎంఈఓ ప్రభుదాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, మార్కండేయ, విద్యాసాగర్, రామచంద్రం, యాదగిరి, లీలారాణి, రమేష్, అశోక్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-దుబ్బాక

మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామానికి చెంది న వతం రాజుకు మంజూరైన రూ.19 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ దుబ్బాక మండ లాధ్యక్షులు కొంగర రవి మంగళవారం అందజే శారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొండంత అండ లభిస్తుందన్నారు. వారి వెంట కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు కద్దూరి నరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చర్లపల్లి బాల్ రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్, ఐరేని సాయితేజ గౌడ్, పలువురు కార్యకర్తలున్నారు.

గుండె పోటుతో వాటర్ మెన్ మృతి


ఫైల్

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామ పంచాయతీ వాటర్ మెన్‌గా పని చేస్తున్న గుండె యాదయ్య(59) మంగళ వారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందాడు. చాల సంవత్సరాలుగా కార్మికునిగా పని చేస్తున్న యాదయ్య సోమవారం రాత్రి మిషన్ భగీరథ నీటిని ట్యాంక్‌లో నింపి ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా గ్రామ పంచాయితీ తరుపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బీసీ కులగణనపై హర్షం



నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన పూర్తి చేసి శాసనసభలో బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా దామరకుంట కాంగ్రెస్ గ్రామా ధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. బీసీ కుల గణన బిల్లుతో రాజకీయ, విద్య, ఉపాధి రంగాలకు దోహదప డుతుందని బీసీ కుల గణన బిల్లు చారిత్రాత్మకమని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గజ్వేల్‌లో ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదని కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలో అన్ని వార్డులను గెలుచుకునేందుకు ఇప్పట "నుంచి ప్రణాళికలు వేస్తుండటంతో ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మున్సిపల్ పరిధిలోని పేదలందరికీ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో 20 స్థానాలను గెలుచుకున్నందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి వార్డులో కమిటీలను వేసినట్లు చెప్పారు.

ఘనంగా బాలథెరిసా జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని కోహెడ నర్సింగ్‌హెూం ప్రయివేట్ ఆసుపత్రిలో మంగళవారం బాలవికాస సామాజిక కార్యకర్త పిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస సంస్థ వ్యవస్థాపకులు బాలమ్మ(బాలథెరిసా) ప్రజాసేవ లో మంచిపేరు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బద్దం తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్, కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి దేవ స్థానం డైరెక్టర్ సిగిరి కొమురయ్య, నాయకులు బోయిని సంపత్, పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-కాంగ్రెస్ మండల ఉపాద్యాక్షులు ర్యాకం యాదగిరి



నవతెలంగాణ-మర్కుక్

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల ఉపాద్యాక్షులు ర్యాకం యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అయా రంగాలతో పాటు వ్యవసాయ రంగానికి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలంగాణ అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రైతులకు రుణమాఫీ, రైతు భరోసాతో రైతులు ఎంతో ఆనందంలో ఉన్నారన్నారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులకు చేసిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంతోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతుల వెన్నుముక్కగా నిలిచారన్నారు. ఇంద్రమ్మ రాజ్యంతోనే పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

టాలెంట్ టెస్టులు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి



నవతెలంగాణ-కొండపాక

విద్యార్థులకు నిర్వహిస్తు న్న టాలెంట్ టెస్ట్‌ల వల్ల విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓ పీ.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళ వారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిం చారు. ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సాత్వికకు మొదటి బహుమతి, కొండపాక కేజీబీవీ విద్యార్థులు హర్షితకు రెండో బహుమతి, భారతి మూడో బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విట్టల్ నాయక్ మండలంలోని ఉన్నత పాఠశాలల ఫిజికల్ సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సత్యం తెలిపారు. సబ్ స్టేషన్‌లో పవర్ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ స్థాయి ఎక్కువ సామర్థ్యం గల దానిని బిగించడం కోసం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ఉన్న రెండు పవర్ ట్రాన్స్ ఫార్మర్లలో గతంలో ఒకటి ఎక్కువ సామర్థ్యం గల దాన్ని బిగించగా మరొక దాన్ని ప్రస్తుతం బిగించనున్నట్టు పేర్కొన్నాడు. దీనివల్ల సబ్ స్టేషన్ పరిధిలోని మార్పడగ, సిరిసినగండ్ల, ఖమ్మం పల్లి, జప్తి నాచారంలోని కొంత ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారుల కనుసన్నల్లో మట్టి దందా..!



- రోజుల తరబడి దోచుకెళ్తున్నా పట్టించుకోని అధికారులు
- టిప్పర్ల రాకపోకలతో భయాందోళనకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజలు





నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వెంచర్లకు అక్రమంగా మట్టి తరలింపు రూరల్ మండలంలో యదేచ్ఛగా కొనసాగుతుంది. మండల పరిధిలోని రావురూకుల గ్రామ శివారు భూముల్లో ఈ వ్యవహారం 4, 5 రోజులుగా నిత్యం కొనసాగుతూనే ఉంది. దీంతో చిన్నగుండవెల్లి, రావురుకుల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మైనింగ్ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతుండగా, సొంత పట్టగలిగిన భూముల నుంచి కూడా మట్టి తవ్వకాలు చేపట్టాలంటే వాటికి సంబంధించిన అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ వాటిని బేఖాతరు చేస్తూ, అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమంది వ్యాపారస్తులు యదేచ్ఛగా ఎర్రమట్టిని సిద్దిపేట నూతన వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిసు న్నారు. మండలంలో జరుగుతున్న మట్టి దందా పై మైనింగ్, పోలీస్, రెవెన్యూ విభాగాల అధికారులు ఆరా తీస్తున్నట్టుగా పైకి చెబుతున్నా లోలోన మాత్రం వీరి అనుమతులతోనే యదేచ్ఛగా ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. లేకపోతే అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా టన్నుల కొద్ది మట్టిని వ్యాపారాలు ఎలా తరలిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అక్రమ మట్టి తందపై సంబంధిత విభాగాల అధికారులు అందరూ దృష్టి సారించి కట్టడి చేయాలని, లేకపోతే చెరువులు గుట్టలు లూటీ అవుతాయని పలువురు అంటున్నారు.

హమాలీ కార్మికులకు అండగా ఏఐటీయూసీ

నవతెలంగాణ-కోహెడ

హమాలీ కార్మికులకు అండగా ఆలిండియా ట్రేడ్ యూనియన్ ముఖ్యపాత్ర పోషిస్తుందని హమాలీ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు చిట్యాల మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ సభ్యత్వ కార్డులను కార్మికులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐకేపీ సెంటర్లు ప్రభుత్వ ఆదీనంలో ఉన్నప్పటికి అందులో పనిచెసే హమాలీ కార్మికులకు ఎలంటి రక్షణ లేదని, ప్రమాదం జరిగితే పట్టించుకోవడం లేదని ఇప్పటికైన నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని, ఐకెపీ సెంటర్లలో గోదాములు, విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగు మల్లయ్య, శెట్టి సుధాకర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిట్యాల సుమన్, రైతులు నాగు రవీందర్, అంజయ్య, ఐలయ్య, మల్లయ్య, నాగు శ్రీనివాస్, పాల్గొన్నారు.



మాజీ వీఆర్ఏలను అరెస్టు చేయడం సరికాదు

- సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మిద్దె కిష్టయ్య



నవతెలంగాణ-కొండపాక

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని మరణించిన వీఆర్ఏల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు చలో హైదరాబాద్ పిలుపునిస్తే వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న వారిని అరెస్టులు చేయడం ప్రభుత్వానికి తగదని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మిద్దె కిష్టయ్య అన్నారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ ముందస్తు అరెస్టుల చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీఆర్ఏలను వివిధ శాఖలలోకి ప్రమోట్ చేస్తూ జీవో విడుదల చేశారు. అదే సందర్భంలో 61 ఏండ్లు నిండిన, మరణించిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం కూడా అధికారంలోకి వస్తే వెంటనే వారసులం దరినీ వివిధ శాఖలోకి వెళ్లిన వారిని రెవెన్యూ వ్యవస్థలోనే కొనసాగిస్తామని అనేక సందర్భాలలో ప్రకటించారు వారసులకు ఉద్యోగం ఇవ్వలేక రెవిన్యూ వ్యవస్థలో విలీనం చేయలేక వీఆర్ఏల అందర్నీ ఆందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి శాంతియుత ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుం దన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అరెస్టులను నిలిపివేసి 60 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులందరికీ నియామకాలు చేపట్టి రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరచాలని కోరారు. వారు చేస్తున్న పోరాటానికి మా మద్దతు ఉంటుందని అన్నారు అరెస్ట్ అయిన వారిలో తూపాక్రా సత్తయ్య బొందయ్య నరసింహులు తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లి గ్రామస్తులకు డప్పులు

- కేబీఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్



నవతెలంగాణ-ములుగు /మార్కుక్

డప్పు కళాకారులకు కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొన్యాల బాల్ రెడ్డి చేయూతను అందించారు. ములుగు మండల పరిధిలోని క్షీరసాగర్, జప్తిసింగాయపల్లి, తునికి బొల్లారం, మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీ, దాసర్లపల్లి, అచ్చాయపల్లి, శ్రీరాంపూర్, బండ తిమ్మాపూర్, నాగిరెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి, నర్సంపల్లి, అడవి మజీద్, కొట్యాల, బైలంపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ, మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన డబ్బు కళాకారులకు డప్పులను అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలం కొల్తూరు, నారాయణపూర్, అనంతారం, పోతారం గ్రామాలకు చెందిన కళాకారులకు ఈ డబ్బులను పంపిణీ చేశారు. రూ.10 లక్షల వ్యయంతో ఆయా గ్రామాల్లో 1200 మంది డప్పు కళాకారులకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు సురేష్, కొన్యాల శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల శ్రీనివాస్ రెడ్డి, సరసం శ్రీనివాస్ రెడ్డి,బిక్షపతి, పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి



నవతెలంగాణ-నంగునూరు

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మోడీ ప్రభుత్వం మొండిచేయి చూపించిందని సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం సిగ్గుచేటని, కేంద్రం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. విద్యను ప్రయోజన వంతంగా అభివృద్ధి చేస్తున్నామనే ప్రచారం ఉన్నప్పటికీ, వాస్తవాలు కేంద్ర విధానాలు విరుద్ధంగా ఉన్నాయనీ, జీడీపీలో విద్యారంగానికి కేటాయింపు 6 శాతం ఉండాలి కానీ, బడ్జెట్‌లో కేవలం 2.8 శాతం మాత్రమే కేటాయించారని విమర్శించారు. 100 శాతం నాణ్యమైన పాఠశాల విద్య, సమ్మిళిత వృద్ధి అనే వాగ్దానం అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బడే అశోక్, నవీన్, బొజ్జ గోపి, శ్రీధర్, రాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖబర్దార్ తీన్మార్ మల్లన్న

- ములుగు మండల రెడ్డి సంఘం నాయకులు



నవతెలంగాణ-ములుగు

కొద్దిరోజుల క్రితం వరంగల్‌లో జరిగిన బీసీ సభలో రెడ్డి సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీర్మార్ మల్లన్న ఖబర్దార్ అంటూ ములుగు మండల రెడ్డి సంఘం నాయకులు పోలీస్‌స్టేషన్లో ఎస్సై విజయ్ కుమార్‌కు తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై కేసు నమోదు చేయాలని మంగళవారం చికెన్ బాల్ రెడ్డి ,కరుణాకర్ రెడ్డి, బాపురెడ్డిలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీ సామాజిక వర్గం గూర్చి మాట్లాడు కానీ ఇతర సామాజిక వర్గం గూర్చి విమర్శించే హక్కు నీకు ఎక్కడిది నీకు రెడ్డి సమాజం చేసిన ద్రోహం ఏమిటి నీ విజయానికి సహకరించడమేనా రెడ్డి చేసిన తప్పు,నువ్వు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని లేనిచో నీవు ఎక్కడికి వెళ్లినా పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, మనోహర్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ పెండింగ్ పనులపై చర్చిద్దాం..

- నర్సారెడ్డికి బీజేపీ సవాల్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ , ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజక వర్గంలో అనేక పెండింగ్ పనులను ఎందుకు పట్టించుక ోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది దాటిందని మున్సిపాలిటీలో ఎక్కడైనా పనులు చేపట్టారని ప్రశ్నించారు. నర్సారెడ్డి కేవలం పైరవీల కోసమే తిరుగుతున్నారని విమర్శించారు. మంత్రుల వద్దకు రోజు పైరవీలు కోసం వెళ్లడం తప్ప గజ్వేల్ అభివృద్ధి కోసం కాదని వారు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లున్న కాంగ్రెస్ నాయకులు విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కేంద్ర బడ్జెట్ విషయంలో కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ అనేక అంశాలపై చర్చించిన విషయం నర్సారెడ్డికి తెలుసునా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు గజ్వేల్ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ఎవరికో తెలిపోయిందన్నారు. అన్ని రంగాలకు ప్రధాని మోడీ ప్రాధాన్య తెచ్చినట్లు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్, రామ్ రెడ్డి, రాములు, అరవిందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు అందజేత



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక కోదండరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూలు డెస్కులు ఆటవస్తులను ఐడీబీఐ బ్యాంక్ ప్రజ్ఞాపూర్ శాఖ వారు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య హజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. బ్యాంక్ శాఖ అధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా దేశంలో వందలాది పాఠశాలలకు స్కూలు బెంచీలు మంచినీటి వసతి ఇతర సదుపాయాలు కల్పించిందని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి వై కృష్ణ మాట్లాడుతూ ఆ బ్యాంకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయ సిబ్బంది శ్రీశైలం ప్రేమలత ఈశ్వర్ అలాగే మెదక్ ఐడిబిఐ శాఖ అధికారి మధు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ పల్లిలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం విశ్వనాథ్ పల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆరో వార్డు మాజీ సభ్యుడు కోడెల రవి, మూడో వార్డు మాజీ సభ్యులు రాజు, బాలరాజు, అర్జున పట్ల కనకయ్య, సత్తయ్య, మహేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన అదితి ఆస్పత్రి సౌజన్యంతో వైద్యులు 103 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు డా. నగేష్ గౌడ్, రాజు, కళ్యాణ్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- నంగునూరు మండలం ఇంచార్జి గుండు భూపేష్
- తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-నంగునూరు

స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యంగా నంగునూరు మండలం కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో మంగళవారం మాజీమంత్రి హరీశ్‌రావు, ఆదేశానుసారం నంగునూరు మండలం బీఆర్ఎస్ అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం గ్రామ శాఖ అధ్యక్షులు ద్వారా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి కార్యకర్తల అభిప్రాయం తీసుకొన్నారు.గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పైన ప్రజల్లో ఉన్న వ్యతిరేకతపై నిలదీయాలని, సర్పంచి ఎలక్షన్‌లో గాని ఎంపీటీసీ లక్షల్లో గాని పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నంగునూరు మండల ఇంచార్జి గుండు భూపేష్, మాజీ ఎంపీపీ జప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచులు ఎలా లతా కృష్ణవెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన ప్లేస్మెంట్



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ఎంప్లాయి ఎమెం ట్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం మంగళవారంతో ముగిసిం ది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ శోభారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల వైస్ ప్రిన్సిపల్ కమలా క్రిస్టియాన మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థినిలకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రధానంగా ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ఈ శిక్షణలో విద్యార్థినీలకు వెర్బల్, నాన్ వెర్బల్, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్, స్ట్రెస్ మేనేజ్మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రోడక్టివిటీ టూల్స్ మాక్ ఇంటర్వ్యూస్ నిర్వహించామని తెలిపారు. మంగళవారం ఏడో రోజు ముగింపు సమావేశం నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి జయరాజు, డాక్టర్ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు







నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని మాజీ సర్పంచులను మంగళవారం ఉదయం ముందస్తు కస్టడీలోకి మర్కుక్ ఏఎస్ఐ అమృత్ అధ్వర్యంలో తీసుకున్నారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల సంఘం జేఏసీ చలో సెక్రటేరియట్‌కు పిలుపు ఇచ్చింది. దీంతో పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తుగా కస్టడీలోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపడానికి వెళుతున్న మమ్ములను సమాచారం లేకుండా ముందస్తుగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. అరెస్టు చేసిన వారిలో మర్కుక్ మండల మాజీ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు అప్పాల ప్రవీణ్, గడ్డం ప్రసాద్, మాధవి రాజిరెడ్డి, గాయత్రి బాల్ నర్సయ్య ,తదితరులున్నారు.

తొగుట: సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల ఫోరం మాజీ మండల ఉపాధ్యక్షుడు బొడ్డు నరసింహులు యాదవ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఉన్న సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు గ్రామ అభివృద్ధి చేసిన తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లిం చలేదని ఆరోపించారు. బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహిస్తే బిల్లులు బాకీ ఉన్న సర్పంచులం అడ్డుకుంటామని హెచ్చరించారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసామని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన సర్పంచ్‌లు, సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి చిక్కుడు చంద్రం, సిలివేరి జ్యోతి మల్లారెడ్డి, మాధవ రెడ్డి గారి ప్రేమల చంద్రారెడ్డి, మంగ రేణుక, నరసింహులు తదితరులున్నారు.

హుస్నాబాద్‌రూరల్ : మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మంగళ వారం పోలీసులు మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లా డుతూ తమకు రావలసిన బిల్లులు ఎన్నికల లోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్షల రూపా యలు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామ న్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి సంవత్సర కాలం దాటిందన్నారు. అయినా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించలేదన్నారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాజీ సర్పంచ్‌లు తోడేటి రమేష్, బత్తిని సాయిలు, పిట్టల సంపత్, బత్తుల మల్లయ్య, గీకూరు వెంకటేశం ఉన్నారు.

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దగ్ధం



నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణం ముస్తాబాద్ చౌరస్తా వద్ద తీన్మార్ మల్లన్న దిష్టి బొమ్మను రెడ్డి సంఘం నాయకులు మంగళవారం దగ్ధం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లడిన మాటలకు నిరసనగా సిద్దిపేట జిల్లాకు చెందిన రెడ్డి సంఘాల నాయకులు మల్లన్న దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా ప్రెసిడెంట్ బత్తుల మమతారెడ్డి, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు వట్టిపెల్లి రాజిరెడ్డి, యశ్వంత్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, రాజలింగారెడ్డి, పాల్గొన్నారు